క్లుప్తంగా

పాఠ్య పుస్తకాలు మంజూరు

ఉయ్యాలవాడ : మండలానికి మొదటి విడతలో 7,514 పాఠ్య పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ అనురాధ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 1 –10వ తరగతి వరకు 2,517 మంది విద్యార్థులకు 25,485 పాఠ్య పుస్తకాలు అవసరమన్నారు. పాఠశాలల పునః ప్రారంభంనాటికి జగనన్న విద్యాకానుక కిట్, అన్ని రకాల పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలలకు చేరవేస్తామని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలి

గోస్పాడు: శ్మశాన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మాల శ్మశాన కార్మికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోసుల ఇసాక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాల్మన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. మాల కులానికి చెందిన వారు గ్రామాల్లో, పట్టణాల్లో ఎట్టి మాలలు బేగరులుగా ఉన్నారని, ఎంతో కాలంగా గ్రామాల్లో పనులు చేస్తున్నా ప్రభుత్వాలు ఇంత వరకు తమకు సహాయం చేయడం లేదన్నారు. ఇప్పటికైనా తమకు గుర్తింపు కార్డులు ఇచ్చి, పెన్షన్‌తో పాటు గౌరవ వేతనం రూ.5వేలు చెల్లించాలని కోరారు.

బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి

గోస్పాడు: ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లోనే షెడ్యూల్‌ను ప్రకటించి బదిలీలు పూర్తి చేయాలన్నారు. దీంతో వచ్చే విద్యాసంవత్సరానికి ఆటంకం ఉండదని పేర్కొన్నారు. జీవో నంబర్.117ను రద్దు చేసి 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసే కార్యక్రమాన్ని నిలిపి వేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఆర్‌ఎస్ రంగాపురం జెడ్పీహెచ్ పాఠశాలకు దాతలు ఇచ్చిన డెస్కులను అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబఫకృద్దీన్ కోరారు. అపహరణకు గురైన డెస్కుల పై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ జెడ్పీహెచ్ పాఠశాలకు మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి రూ.2లక్షలు వెచ్చించి వంద డెస్కులు విరాళంగా అందజేశారని గుర్తుచేశారు. ఇటీవల పాఠశాలకు కొత్తగా వచ్చిన హెచ్‌ఎం డెస్కులు బాగా లేవంటూ, ఎవరి అనుమతి తీసుకోకుండా ప్రైవేటు పాఠశాలలకు అమ్మడం దారుణమన్నారు. నాయకులు ప్రసాదు, సుబ్బరాయుడు ఉన్నారు.

నిధులు మంజూరు

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి ఎంపీ ల్యాండ్స్ కింద రూ.1.40 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణ సోమవారం తెలిపారు. స్థానిక బస్టాండు నుంచి కుందూనది వరకు 1,500 మీటర్ల పొడువున అండర్ గ్రౌండ్ నిర్మాణానికి నిధులు వ్యయం చేస్తామని చెప్పారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామని ఏఈ స్పష్టం చేశారు.

నేడు హరివరంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్

ఉయ్యాలవాడ : మండలంలోని హరివరం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ శిబిరం నిర్వహిస్తామని వైద్యాధికారి రమేష్‌చంద్ర బాలాజీ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి వైద్య బృందం 104 వాహనంలో ఉదయం 9 గంటలకు చేరుకుని సాయంత్రం 4 గంటల వరకు గ్రామస్తులకు వైద్య సేవలు అందిస్తామని చెప్పారు.

ఒత్తిడిని నియంత్రించుకోవాలి

గోస్పాడు: ప్రతి ఒక్కరూ ఒత్తిడిని నియంత్రించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాల్ తెలిపారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వ్యాయామం, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వయస్సు పైబడుతున్న వారు ప్రతి రోజూ వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటిని అలవర్చుకోవాలని సూచించారు. పరిమితం ఆహారంతో పాటు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తపోటు, మధుమేహం నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా పెంపొందేలా చూసుకోవాలని వివరించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, స్థానికులు పాల్గొన్నారు.

రైతన్నకు భరోసా

- ఖరీఫ్‌నకు ముందే అన్నదాతలకు అందనున్న 'రైతు భరోసా'
- ఈ నెల 15 వరకు సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో లబ్ధిదారుల జాబితా ప్రదర్శన
- 15 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం

ఆళ్లగడ్డ: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల పక్షపాతిగా పేరుగాంచింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. పంటల సాగులో అన్నదాతకు అడుగడుగునా అండగా నిలిచేందుకు పథకాలు అమలు చేస్తోంది. భూసార పరీక్షల నుంచి దిగుబడులు కొనుగోలు వరకు చేదోడు వాదోడుగా ఉంటుంది. ముఖ్యంగా ఏటా ఖరీఫ్ ప్రారంభ సమయంలో పంటల సాగుకు రైతన్నలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రైతు భరోసా పథకంలో భాగంగా కొంత మొత్తాన్ని సాయంగా అందజేస్తుంది. ఈ పథకం ద్వారా నాలుగేళ్లుగా పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.13,500 నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. ఇందులో భాగంగా 2022 – 23లో నియోజవర్గంలోని ఆరు మండలాల్లో 45,955 మంది రైతుల ఖాతాల్లో రూ.62,03,92,500 జమ అయ్యింది. 2023 –24కు గాను తొలి విడత పెట్టుబడి సాయం అర్హులైన అన్నదాతల ఖాతాల్లో జమ చేసేందుకు వ్యవసాయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఖరీఫ్ సాగులో దుక్కులు దున్నుకునేందుకు, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు నగదు అందజేస్తుండటంపై కర్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు..

2023 – 24 సీజన్‌కు సంబంధించి వైఎస్సార్ రైతు భరోసా పథకానికి కొత్తగా అర్హత పొందినవారు, గతంలో అర్హత కలిగి లబ్ధి పొందని భూ యజమాన రైతులు, అటవీ భూ సాగుదారులు ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. సమీప ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించి తమ దరఖాస్తులను రైతు భరోసా పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకునేందుకు ముందుగా ఈ నెల 3 వరకు గడువు ఇచ్చింది. వీటిని పరిశీలించి అర్హత కలిగిన రైతుల జాబితాను సామాజిక తనిఖీల్లో భాగంగా ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు ఆర్బీకేల్లో ప్రదర్శించారు. ఎవరైనా అనర్హులున్నట్లుగా గుర్తించినా వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకు రావచ్చు. అలాగే అర్హత ఉండి ఇంకా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం కల్పించింది. గత ఏడాది లబ్ధి పొందిన వారు ఈ ఏడాది దరఖాస్తు చేసుకోనవసరం లేదు. ఒకవేళ లబ్ధిదారు మరణించినట్లైతే వారి భార్య లేదా భర్త నామినీగా దరఖాస్తు చేసుకోవాలి.



సేద్యం చేస్తున్న రైతులు

మూడు విడతలుగా..

వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ కింద ప్రభుత్వం ఏటా ముడు విడుతల్లో రూ.13,500 అందిస్తోంది. రూ.7,500 మే నెలలో, రూ.4 వేలు అక్టోబర్‌లో, మిగిలిన రూ. 2 వేలు జనవరిలో జమ చేస్తున్నారు. భూ యజమానులకు మాత్రమే పీఎం కిసాన్ కింద కేంద్రం మూడు విడుతల్లో రూ.6వేల చొప్పున జమ చేస్తోంది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారులతో పాటు దేవదాయ, అటవీ, వక్ఫ్ తదితర ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న, కౌలుదారులకు రూ.13,500 చొప్పున వైఎస్సార్ రైతు భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.

ఆనందంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. మూడేళ్లుగా రైతు భరోసా జమ అవుతోంది. ఏటా ఖరీఫ్ ప్రారంభానికి ముందే నగదు ఇస్తుండటంతో పంటల సాగుకు ఇబ్బందులు తప్పుతున్నాయి. ఈ మొత్తం పెట్టుబడిలో కొంత సాయంగా నిలుస్తుండటంతో ఆనందంగా ఉంది.

– ముజఫర్ హుసేన్, శిరివెళ్ల

నిజంగా భరోసానే



ప్రభుత్వం అందజేసే రైతు భరోసా నగదు ఎంతో ఉపయోగకరంగా ఉంది. నాకు రెండేళ్ల నుంచి రైతు భరోసా జమ అవుతోంది. ఒకప్పుడు విత్తనాల కొనుగోలుకు, పంట సాగుకు, సేద్యానికి డబ్బుల కోసం నానా అగచాట్లు పడేవాళ్లం. రెండేళ్లుగా పెట్టబడి సాయం అందుతుండటంతో కొంత మేర ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. నిజంగా ఈ సొమ్ము రైతుకు భరోసాగా నిలుస్తుంది.

– చెన్నయ్య, క్రిష్టిపాడు

అర్హులందరికీ అందజేస్తాం



అర్హులైన రైతులందరికీ ' వైఎస్సార్ రైతు భరోసా' వర్తింపజేస్తాం. ఇప్పటికే అర్హుల జాబితా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించాం. రైతులు పరిశీలించుకోవచ్చు. జాబితాలో పేరు లేకపోతే ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తుచేసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం అందరికీ అవకాశం కల్పించాలని ఆదేశించింది. రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– మోహన్‌రావు, జిల్లా వ్యవసాయధికారి

నిధులు మంజూరు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికుల క్లయిమ్స్ రూ.5.60 కోట్లు తక్షణమే మంజూరు చేయాలని ఏపీ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేంద్ర డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా కార్మిక సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రఘురామ్మూర్తి, సుంకయ్య పాల్గొన్నారు. అనంతరం సురేంద్ర మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే నిర్మాణాలు నిలిచి పోతాయన్నారు. నాయకులు శివ, బాలకృష్ణ, పుల్లయ్య, సుధాకర్‌నాయుడు, రెహమాన్ పాల్గొన్నారు.

మున్సిపల్ స్పందనకు రెండు వినతులు

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు రెండు ఫిర్యాదులు వచ్చాయి.ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి సచివాలయంలో రోజూ మద్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన నిర్వహిస్తుండటం, సమస్యలను వెంటనే పరిష్కారం చూపుతుండటంతో స్పందనకు తక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. వినతుల్లో వ్యాయామ పరికరాల బిల్లులు విడుదల చేయాలని, లైసెన్స్‌డ్ సర్వేయర్‌ను బ్లాక్ లిస్టు నుంచి తొలగించాలని కోరారు.

ముగిసిన క్రికెట్ లీగ్ పోటీలు



మొదటి బహుమతి అందుకున్న నంద్యాల జట్టు

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరులో సమ్మర్ క్రికెట్ లీగ్ పోటీలు సోమవారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 48 జట్లు పోటీలో పాల్గొన్నాయి. వాటిల్లో నంద్యాల సంజీవ లయన్స్ జట్టు విజేతగా నిలిచి మొదటి బహుమతిని రూ. 30వేల చెక్కును అందుకుంది. రన్నరప్‌గా చిన్నకంబలూరుకు చెందిన టీమ్‌కు రు.20వేల నగదు అందజేశారు. అలాగే మూడో బహుమతి శిరివెళ్ల మండలం మహదేవపురం జట్టు గెలుపొందగా రూ.10వేలు, నాల్గో బహుమతి మాచినేనిపల్లె జట్టుకు రూ.5వేల నగదును దాతల సహకారంతో అందజేశారు.

ఆర్థిక పరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

నంద్యాల(అర్బన్): సామాజిక వెనుకబాటుతనాన్ని పోగొట్టడానికి భారత రాజ్యాంగ రచయితలు రిజర్వేషన్లు ఏర్పాటు చేశారని, రిజర్వేషన్లకు ఆర్థికతను ముడిపెట్టడం సరికాదని ప్రముఖ రచయిత, అనువాదకులు సిద్ధార్థ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఈడబ్ల్యూఎస్– రిజర్వేషన్లను అంతం చేసే కుట్ర అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. దళిత మేధావుల ఫోరం నాయకులు నాదస్వరం నరసింహ, సుజిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిద్ధార్థ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50శాతం మాత్రమే రిజర్వేషన్లు ఉండాలని, అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్లు కేటాయించటం కోర్టు తీర్పుకు విరుద్ధమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధికారులు భూషణం, కృష్ణయ్య, న్యాయవాది బాలస్వామి, మేకల లింగ స్వామి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నంద్యాల టౌన్ : 104 వాహనాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, అధ్యక్షుడు ఏసురత్నం మాట్లాడుతూ 104 వాహన సేవలను గతంలో ఉన్నట్లుగా.. ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు చెల్లించాలని కోరారు. 104 డ్రైవర్లు ప్రసాద్, ఇశాక్ తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకోత్సవం

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి మహానందిలో పల్లకోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, రవిశంకర అవధాని, అర్చకులు స్వామి,అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు ఇచ్చారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం

డోర్నిపాడు: గుండుపాపల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. కేడీసీసీ బ్యాంక్ ఆర్థిక సాయంతో హెచ్‌పీ కార్పొరేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను సహకార సంఘం చైర్మన్ బాల వెంకటరెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్యే సోమవారం ప్రారంభిచారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల–కోవెలకుంట్ల మధ్యలో కేవలం గోస్పాడులోనే బంక్ ఉండేదని, దీంతో రైతులు, వాహనదారులు ఇబ్బందులు పడేవారన్నారు.ఈ బంక్ ఏర్పాటుతో ఇబ్బందులు తప్పుతాయన్నారు.అలాగే ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మరో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్‌పర్సన్ సన్నల మహాలక్ష్మి మాట్లాడుతూ ఇక్కడి అవసరాల దృష్ట్యా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు బ్యాంకు సొంత నిధుల నుంచి రూ.74 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు, సీఈఓ సుబ్బారావు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈఓ రామంజనేయులు, జనరల్ మేనేజర్ శివలీల, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి, జిల్లా ప్రాజెక్ట్ అధికారి భరద్వాజ శర్మ, కోవెలకుంట్ల బ్రాంచ్ మేనేజర్ లక్ష్మినారాయణ, హెచ్‌పీసీఎల్ మేనేజర్ చంద్రశేఖర్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, పాలూరు సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్రామయ్య

ఆళ్లగడ్డ: దాడి జరిగిన గంటలోపు నిందుతుడిని అదుపులోకి తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన సోమవారం చాగలమర్రి మండలం రాంపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కాటసాని రఘునాథరెడ్డి, ఆయన మరదలు ప్రభావతమ్మ మధ్య ఆస్తి తగదా నెలకొంది. దీనిపై ఇరు వర్గాలు కోర్టును కూడా ఆశ్రయించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ప్రభావతమ్మ తన పొలం వద్ద ఉండగా రఘునాథరెడ్డి వాగ్వాదానికి దిగి దూషిస్తూ ఆమె దాడి చేశాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ రమణయ్య అక్కడికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని బాధితురాలిని వైద్యశాలకు తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు రఘునాథరెడ్డితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ వివరించారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

సుంకులాపరమేశ్వరికి జలాభిషేకం

నంద్యాల వ్యవసాయం: పట్టణంలోని కోట వీధిలో వెలసిన శ్రీ సుంకులా పరమేశ్వరి దేవి చండీ ఉత్సవాన్ని పురస్కరించుకుని మొదటి రోజు సోమవారం అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. తెల్లవారు జామునే మహిళలు చిన్న చెరువు నుంచి గంగా జలాన్ని మేలతాలాలతో తీసుకొచ్చి వేద పండితుల ఆధ్వర్యంలో జలాభిషేకం చేశారు. అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించి మహా మంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంకాలం ప్రదోష పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ లోక కల్యాణార్థం చండీ యాగం నిర్వహిస్తున్నామని తెలిపారు. మంగళవారం అమ్మవారికి క్షీరాభిషేకం, చండీ హోమం, సాయంత్రం కుంకుమార్చన, బుధవారం చండీ హోమం జరిపించి, పూర్ణాహుతి అనంతరం అన్నదాన చేస్తామన్నారు. సాయంత్రం ఉత్సవమూర్తికి గ్రామోత్సవం ఉంటుందని వివరించారు.



అమ్మవారి సన్నిధిలో జలాలతో కూడిన కళశాలు

పర్యావరణాన్ని రక్షించుకుందాం

రుద్రవరం: పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని రుద్రవరం, చెలిమ రేంజి అధికారులు ప్రజలకు సూచించారు. చెలిమ రేంజి నుంచి సెక్షన్ అధికారి శ్రీనివాసులు, రుద్రవరం నుంచి నూతల సెక్షన్ అధికారి శ్రీనివాసరెడ్డి మండలంలోని పెద్ద కంబలూరు, నర్సాపురం గ్రామాల్లో సోమవారం 'పర్యావరణం కొరకు జీవన శైలి' అనే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పచ్చదనాన్ని పెంపొందించాలని, ప్లాస్టిక్‌ను వాడరాని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఇరు వర్గాల ఘర్షణ

ఉయ్యాలవాడ : మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన ఇరు వర్గాలు ఘర్షణ పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రఫీ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొట్టం బాల పక్కీర, హుసేనయ్యపై.. బాలమద్దిలేటి, రవీనా, మధు, సుమంత్ కుమార్ దాడి చేసి గాయపరచారు. అలాగే బాల పక్కీర, హుసేయ్య..బాలమద్దిలేటి మధు, సుమంత్‌కుమార్‌పై దాడి చేసి గాయపరచారు. ఇరు వర్గాలు పాత కక్షలు మనసుస్సులో పెట్టుకుని ఘర్షణ పడ్డారు. రెండు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

ఆళ్లగడ్డ: బోటు ప్రమాదంలో మృతి చెందిన మృతుల కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆవుకు రిజర్వాయర్‌లో జరిగిన బోటు ప్రమాదంలో ఆళ్లగడ్డ సబ్‌డివిజన్‌లో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రసూల్ కుటుంబ సభ్యులు ముగ్గురు మృత్యువాతపడిన విషయం తెలిసిందే. రసూల్ కూతురు మృత దేహం సోమవారం బయటపడటంతో మృతదేహాన్ని నంద్యాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల నంద్యాలలోని రసూల్ ఇంటికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి, రసూల్‌ను ఓదార్చారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెలే గంగుల బిజేంద్రారెడ్డి

ట్రైసైకిల్ అందజేత

ఆళ్లగడ్డ: మండల కేంద్రం చాగలమర్రిలో వైఎస్సార్ సీపీ నాయకులు బాబూలాల్ యువసేన ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగుడు పాపన్నకు ట్రైసైకిల్ అందజేశారు. బాబూలాల్ మాట్లాడుతూ నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, నాయకులు బషీర్, షబ్బీర్ ఉన్నారు.

నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలి

మిడుతూరు: ఉపాధ్యాయులు శిక్షణలో నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని కర్నూలు జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. సోమవారాం స్థానిక ఆదర్శ పాఠశాలలో 2018 డీఎస్సీకి ఎంపికైన స్కూల్ అసిస్టెంట్ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులకు రాష్ట్రవ్యాప్తంగా ఇండస్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే శిక్షణలో రిసోర్స్ పర్సన్లు బోధనలో మెళకువలు, సులభరీతిలో మ్యాప్ పాయింటింగ్ గుర్తించడం, వెనుబడిన విద్యార్థుల పట్ల అనుసరించాల్సిన బోధన విధానాలు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారని చెప్పారు. ఎంఈఓ మౌలాలి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సలీంబాషా, రిసోర్సు పర్సన్లు, నాలు గు జిల్లాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

రేషన్ బియ్యం స్వాధీనం

మహానంది: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు మహానంది ఎస్ఐ జి.నాగేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు పట్టణానికి చెందిన హసన్‌బాషా, పెద్దమద్దిలేటి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా బుక్కాపురం వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 220 బ్యాగుల్లో సుమారు 10,120 కిలోల బియ్యాన్ని సీజ్ చేశారు. వీరికి సహకరించిన నలుగురు వ్యక్తులను విచారిస్తాన్నామని చెప్పారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలి

ఉయ్యాలవాడ : స్పందన కార్యక్రమంలో వచ్చిన సమస్యలకు సత్వర పరిష్కారం చేపేందుకు చొరవ తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి హాజరైన అధికారులతో ఆయన మాట్లాడారు. నర్సిపల్లె గ్రామానికి చెందిన రామసుబ్బయ్య ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో, మొదటి విడత బిల్లు రూ.1.10 లక్షలు ఖాతాలో జమైందని, మూడు నెలలు గడుస్తున్నా రూ.70 వేలు బిల్లు అందలేదని హౌసింగ్ ఏఈ నాగరాజుకు విన్నవించాడు. ఆర్ఐ తులసీకృష్ణ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రామకృష్ణారెడ్డి, ఫణీత్‌కృష్ణ, ఏఓ రాజేంద్రకుమార్, పశు వైద్యాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



స్పందనలో పాల్గొన్న అధికారులు

సమస్యలు పరిష్కరించకపోతే పతనం తప్పదు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధి హామీ పథకం బడ్జెట్ సవరించి కూలీల సమస్యలు పరిష్కరించకపోతే కేంద్ర ప్రభుత్వానికి పతనం తప్పదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కూలీల సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో తక్కువగా కేటాయించి బీజేపీ ప్రభుత్వం పేదలకు ఉపాధిని దూరం చేసే కుట్రకు పాల్పడుతుందని మండిపడ్డారు. కొత్తగా ఫొటో యాప్ వల్ల కూలీలు నష్టపోయే ప్రమాదముందని, గతంలో ఉన్న మౌలిక సదుపాయాలన్నీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పనులు చేస్తూ మృతి చెందే కూలీలకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని కోరారు. అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివనాగరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు ఈశ్వరయ్య, డేవిడ్, నరసింహనాయక్, పక్కీర, బాలయ్య పాల్గొన్నారు.



పీడీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

వాల్మీకులకు టీడీపీ చేసిందేమీలేదు

నంద్యాల(అర్బన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 14ఏళ్లు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ వాల్మీకులకు ఏం న్యాయం చేశారో చెప్పాలని వీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నారాయణ ప్రశ్నించారు. యువగళం పాదయాత్రతో నంద్యాలకు వస్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వాల్మీకి సంఘం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించే సత్తా మీకుందా అని ప్రశ్నించారు. అన్నేళ్లు అధికారంలో ఉండి వాల్మీకులకు ఏమీ చేయలేని వారు.. ప్రస్తుతం న్యాయం చేస్తామని చెప్పడంలో అర్థం లేదన్నారు. 2016లో సత్యపాల్ కమిటీ, కారెం శివాజీ కమిటీ వేసి 2017లో అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన అనంతరం పార్లమెంట్‌లో వాల్మీకుల ప్రస్తావనే చేయలేదని గుర్తు చేశారు. వాల్మీకులను మోసం చేసేందుకే అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపామని చెప్పుకోవడం దారుణమన్నారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరిస్తూ తీర్మానం చేస్తే మీ పార్టీలోని ఇతర కులాల వారు టీడీపీ జెండాలు పట్టుకొని బోయలకు వ్యతిరేకంగా ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించారు. మీరు చేస్తే మంచి, ఇతరులు చేస్తే తప్పుడు తీర్మానమా అని మండిపడ్డారు. వాల్మీకులకు మేలు చేసే ప్రభుత్వాన్ని సమర్థిస్తామని, మోసపూరిత ప్రకటనలు మానుకొని పాదయాత్రలో నిమగ్నం కావాలని హితవు పలికారు. అధికారంలో ఉన్నప్పుడూ వాల్మీకులకు ఇచ్చామంటున్న రూ.25కోట్లు ఆధారాలతో చూపాలని సవాల్ విసిరారు. మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని, ఏ ప్రభుత్వంలో వాల్మీకులకు లభించని ప్రాధాన్యత ఇప్పుడు లభించిందని చెప్పారు. నాయకులు పరమేష్, మాజీ ఎంపీటీసీ రమణ, నరసింహులు, పుల్లయ్య, సూరి, శివ, మధు, బుజ్జి, జంపాలు, గుమ్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణ